క్లుప్తంగా

సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో పంచాయతీరాజ్ శాఖలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తు ఉద్యోగ విరమణ పొందిన తాజొద్దీన్‌ను తెలంగాణ హక్కుల పోరాటసమితి, కలీమా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. మసీదులో సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అమీన్, మండల అధ్యక్షుడు ముజాహీద్, కోశాధికారి ఖమర్, కలీమా మసీద్ కోశాధికారి అజ్మత్ అలీ, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

భూపాలపల్లి రూరల్: కార్పొరేట్ సెలూన్లు జిల్లాలో ప్రారంభించొద్దని కోరుతూ అంబేడ్కర్ సెంటర్‌లో జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం రెండో రోజుకు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేట, మేదరమెట్ల వెళ్లే దారి మధ్యలో తరచూ రోడ్డు ప్రమాదాలు అవుతున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తక్కళపల్లి రాజు పొక్లెయినర్ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేసినట్లు తెలిపారు.

నియామకం



రేగొండ: బహుజన్ సమాజ్ పార్టీ కొత్తపల్లిగోరి మండల అధ్యక్షుడిగా పుల్లాల యాకూబ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయనను నియమించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేకల ఓంకార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేల్పుగొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత



ములుగు రూరల్: అక్రమంగా అటవీ ప్రాంతం నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలపను అటవీశాఖ అధికారులు ఇంచర్ల శివారులో పట్టుకున్నారు. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం(ఎం), పస్రా రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలో బిలుగు, నల్లమద్ది కర్రను సెంట్రింగ్ కోసం నరికి మల్లంపల్లికి తరలించే క్రమంలో అటవీశాఖ మొబైల్‌పార్టీ ఎస్ఆర్ఓ శ్రావణి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. పట్టుబడిన కర్ర, ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



సంగీత్ (ఫైల్)

రేగొండ: యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తిరుమలగిరిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన పోలవేన సంగీత్ (25) కొంతకాలంగా హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన సంగీత్ తనకు కారు కొని ఇవ్వాలని తండ్రి విజేందర్‌ను అడిగాడు. దీంతో తన వద్ద కారు కొనడానికి డబ్బులు లేవని తండ్రి తెలపడంతో మనస్తాపంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్కెలు తీర్చే ఎల్లమ్మతల్లి..

- రాఘవరెడ్డిపేటలో జాతర నిర్వహణ
- అట్టహాసంగా కొనసాగిన ఎల్లమ్మ పట్నాలు, బోనాలు



ఉత్సవాలకు హాజరైన భక్తజనం

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రతీ ఉగాది పర్వదినం ముందుగా నిర్వహించే పట్నాలు, బోనాల జాతర శుక్రవారం అత్యంత వైభవోపేతంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే ఎల్లమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించి, బోనాలు సమర్పించారు. జాతరకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరై ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ తల్లికి మహిళా భక్తులు బోనాలు సమర్పించారు. దేవతామూర్తికి పట్నాల ముందు బోనాలను సమర్పించిన అనంతరం మేకను మత్తు గొలిపే కార్యక్రమం ఉత్సవాల ప్రత్యేకం. ప్రతీ సంవత్సరం నిర్వహించే ఎల్లమ్మతల్లి బోనాలు, పట్నాల ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు సకల సౌకర్యాలతో పాటు భోజన వసతిని సైతం ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఉత్సవాలకు మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



పట్నాల వద్ద ప్రత్యేక పూజల్లో నిర్వాహకులు

ఉత్సవాలకు హాజరవుతా..



రాఘవరెడ్డిపేటలో కోరిన కోర్కెలు తీర్చే మావురాల ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు ప్రతీ సంవత్సరం హాజరై మొక్కులు చెల్లిస్తా. ఆలయంలో జరిగే ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకం. ఉత్సవాలకు మండలంలోని భక్తులతో పాటు, నేను హాజరు కావడం అదృష్టంగా భావిస్తున్నా.

– మామిండ్ల శ్రీలత, టేకుమట్ల

విజయవంతం చేశాం..



ప్రతీ సంవత్సరం ఎల్లమ్మ బోనాలు, పట్నాల ఉత్సవాలకు అశేష భక్తజనం హాజరతున్న సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఆలయ ప్రాంగణంలో మహిళలకు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతం చేశాం.

– వంగ ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డిపేట

రేషన్ కార్డుల మంజూరులో విఫలం



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్

భూపాలపల్లి అర్బన్: అర్హులైన ప్రతీ ఒక్కరికి వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేసి, రాజీవ్ యువ వికాసం పథకాన్ని యధవిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి నంబర్లను మంజూరు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా గుడిసెవాసులకు నీటి వసతి కల్పించాలన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేరెళ్ల జోసెఫ్, గద్దం సింహాద్రి, యాకుబ్ పాషా, పీక రవి, గోనెల తిరుపతి, దొంతరబోయిన అజయ్, బొౌతు కమలాకర్, రమేష్, చారి, శేఖర్, లావణ్య, స్వరూప, పెద్దమామల సంధ్య, తిరుపతమ్మ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

కాటారం: వక్ఫ్ సవరణ బిల్లు 2024ని వ్యతిరేకిస్తూ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు అల్విదా జామా రోజున మండల కేంద్రంలోని మజీద్‌లో ముస్లింలు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి మజీద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మజీద్ ప్రసిడెంట్ షేక్ అమీర్ మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, ఖాన్గాలు, స్మశాన వాటికలు, ధర్మాక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కుట్ర అని ఆరోపించారు. ఈ బిల్లును వ్యతిరేకించడం దేశంలోని ప్రతి ముస్లిం బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. శాంతియుత నిరసనతో వ్యతిరేకతను తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం సోదరులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాదినుంచి సన్న బియ్యం పంపిణీ



రేగొండ: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్వేత



కాటారం: మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

- తహసీల్దార్ శ్వేత

రేగొండ: రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉగాది పండుగ నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్వేత డీలర్లకు సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏప్రిల్ నుంచి ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతీ ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ రజాక్, ఆర్ఐ భరత్‌రెడ్డి, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్న బియ్యం పంపిణీ మండలంలో డీలర్లు సక్రమంగా కొనసాగించాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఏప్రిల్ నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో మొక్కజొన్న రైతులు మధుకృష్ణ, చందర్‌రావ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి ఏటూరునాగారం ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి వచ్చిన రూ.25 వేల విలువ గల చెక్కులను తహసీల్దార్ లక్ష్మీరాజయ్య శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ మహేందర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి నాగరాణి

మొగుళ్లపల్లి: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వేసవిలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిని నాగరాణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు, ఆశకార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజలకు వడదెబ్బ వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, నిద్రపట్టకపోవడం, అపస్మారక స్థితి లక్షణాలు ఉంటే వడదెబ్బగా భావించి వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఈ తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్, సునీత తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపిక



బొచ్చు రాకేశ్



ఐతు అంజి

పలిమెల: మండలంలోని పంకెన, అప్పాజీపేట గ్రామాల యువకులు గురువారం విడుదలైన ఫలితాల్లో అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. బొచ్చు రాకేష్, ఐతు అంజి ఆర్మీ జనరల్ డ్యూటీలో ఎంపిక కాగా యువకులను ఆయా గ్రామాల ప్రజలు అభినందనలు తెలిపారు.

అంకుషాపూర్‌లో..



టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన నానవేని అక్షిత్ ఆర్మీ జనరల్ డ్యూటీ కేటగిరిలో ఎంపికయ్యాడు. అగ్నివీర్‌కు ఎంపిక కావడంతో అక్షిత్‌ను గ్రామస్తులు శుక్రవారం అభినందించారు. ప్రతీ యువకుడు ఉద్యోగాన్ని సాధించి ఉన్న ఊరికి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు.

ఉచిత పశు వైద్యశిబిరాలు



టేకుమట్ల: శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీదేవి

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి(బి)లో చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏడీ డాక్టర్ వెంకన్న, పశు వైద్యాధికారి వివేక్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు చికిత్సనందించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, సూపర్‌వైజర్ రాజేందర్, డైరెక్టర్లు సంపత్, విజేందర్, గోపాలమిత్రలు కుమారస్వామి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాత్రాపురంలో ..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం గామంలో పశు వైద్యశిబిరాన్ని శుక్రవారం నూగూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని రైతులు, పశువుల యజమానులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో వైద్యులు పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, ఏడీఏ వేణు, వైద్యాధికారులు హరీశ్‌రెడ్డి, హరీశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసం రమేష్, చిట్టిమల్ల దేవసహాయం తదితరులు ఉన్నారు.

తై బజార్ నిర్వహణకు వేలం



వేలం పాటలో పాల్గొన్న అధికారులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే తై బజార్ వేలం పాటను ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీఓ కుమార్ ఆధ్వర్యంలో వ్యాపారుల సమక్షంలో నిర్వహించారు. వేలంలో పాల్గొన్న వ్యాపారులు వేలం దక్కించుకునేందుకు ఒకరిపై ఒకరు పోటీ పడగా మండల కేంద్రానికి చెందిన కురుకు హరికృష్ణ అనే వ్యక్తి గంప చిట్టిని రూ.2.50లక్షలకు దక్కించుకున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అదేవిధంగా కమేల పాటను నిర్వహించగా మరో వ్యక్తి రూ.90 వేలకు దక్కించుకున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ వేల పాట ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి రూ.3.40 లక్షల ఆదాయం రానుందన్నారు. వేలం పాటలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి మంత్రి పదవి ఇవ్వాలి

- టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాధవరెడ్డి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సొసైటీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, టీపీసీసీ సభ్యుడిగా, ఏఐసీసీ సభ్యుడిగా పదవులు నిర్వహించారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ పాదయాత్రలో కీలకపాత్ర పోషించి 2004 ఎన్నికల్లో పొత్తులో భాగంగా టీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి టికెట్ ఇచ్చినా బాధపడకుండా ఆయన గెలుపులో కీలకపాత్ర పోషించాడని తెలిపారు. 2014 ఎన్నికల్లో మాధవరెడ్డికి టికెట్ ఇవ్వకపోతే ప్రజల, పార్టీ శ్రేణుల కోరిక మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి అనంతరం టీఆర్ఎస్ ప్రలోభాలకు గురి కాకుండా అగ్రనేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఢిల్లీలో పార్టీలో చేరినట్టు వివరించారు. త్వరలో మరో ఆరు మంత్రి పదవులు కేటాయించనున్న క్రమంలో నిజాయితీకి నిదర్శనంగా నిలుస్తున్న క్రమంలో మాధవరెడ్డికి అవకాశం ఇవ్వాలని కోరారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



మంగపేట: ఇఫ్తార్ విందులో పాల్గొన్న సూర్య



వాజేడులో..

- కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య

మంగపేట: మతసామరస్యానికి రంజాన్ మాసం ప్రతీకగా నిలుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండల కేంద్రంలోని మసీదులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం వలన హిందూ ముస్లిం అనే తేడా లేకుండా సోదరభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టీవీఆర్ సూరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, నాయకులు అయ్యోరి యానయ్య, సయ్యద్ హుస్సేన్, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: ఇఫ్తార్ విందులు మతసామరస్యం, స్నేహభావాన్ని పెంపొందించేందుకు దోహద పడతాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మినర్సింహరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జుమా మసీద్‌లో రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖాజాపాషా, తుమ్మ మల్లారెడ్డి, ఎండీ వలీబాబా, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవిందునాయక్, కాకులమర్రి ప్రదీప్‌రావు, తాడూరి రఘు, ఎస్‌కె.అజ్మత్‌ఖాన్, ఏజాజ్, కిరణ్‌కుమార్, నూతి కృష్ణమూర్తి, కుమ్మరి చంద్రబాబు, కావేరి చిన్ని కృష్ణ, జాడి బోజారావు, నర్సయ్య, నాగరాజు, మందపల్లి చంద్రం, పర్వతాల ఎల్లయ్య ఉన్నారు.

వాజేడు: రంజాన్ మాసం సందర్భంగా మసీద్ ప్రెసిడెంట్ మజీద్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో తహసీల్దార్, శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హుస్సేన్, దావూద్, పాషా, బషీర్ తదితరులున్నారు.

బోలోనిపల్లెలో పోచమ్మ పండుగ



ప్రభ బండ్ల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

- ఘనంగా ప్రభబండ్ల కార్యక్రమం

ములుగు: బోలోనిపల్లెలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ పండుగలో ప్రభ బండ్ల కార్యక్రమాన్ని జాతీయ బీసీ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు బట్ట మురళీ కృష్ణ, బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్యా జంపన్న, బీసీ సంఘం ములుగు జిల్లా యూత్ అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నర్సంపేట నియోజకవర్గం నల్లబెల్లి మండలంలోని బోలోనిపల్లెలో ప్రభ బండి కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కులు చెల్లించడం సంతోషంగా ఉందన్నారు. బీసీలు రాష్ట్ర ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుండేలా పోచమ్మతల్లి దీవించాలని కోరారు. కార్యక్రమంలో మేరుగ రాజు, మొర్రి రాజు, గోల్కొండ రాజు, బక్కి నాగరాజు, మనోహర స్వామి, మొర్రి హరీశ్ తదితరులు ఉన్నారు.

బస్సును ఢీకొట్టిన ఇసుక లారీ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొండాపురం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సును ఇసుక లారీ ఢీకొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మండల కేంద్రానికి వస్తున్న ఆర్టీసీ బస్సును కొండాపురం సమీపంలో చర్ల మండలం నుంచి వస్తున్న ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కాగా బస్సులో ఉన్న ఓ మహిళ కాసేపు ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి తిరిగి మాములు స్థితికి వచ్చింది. కాగా ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారు.

గ్రామ పంచాయతీలో ఉగాది వేడుకలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉగాది వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో మట్టికుండను వేపాకులతో అలంకరించి షడ్రుచులతో పచ్చడి తయారీ చేశారు. సిబ్బంది సైతం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై శ్రావన్‌కుమార్

చిట్యాల: మండలంలోని తిరుమలపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఎస్సై శ్రావన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఫోన్ గుర్తించడంలో సహాయ పడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను ఎస్సై అభినందించారు.